సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 10 । జూన్ । 2025



పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ షురూ!

పీఎం కుసుం పథకంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. - 8లో▸



టీపీసీసీలో నేతలకు పదవులు

కాంగ్రెస్ అధిష్టానం సోమవారం రాత్రి ప్రకటించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో ఉమ్మడి జిల్లా నాయకులకు కీలక పదవులు కట్టబెట్టింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39.5^0 /28.3^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీటీపీ కోర్సు ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన డీటీపీ సెంటర్‌ను సోమవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఫొటోషాపు, పేజీమేకర్, కోరల్ డ్రా, అడోబ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ స్కిల్ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు స్వయం ఉపాధి పొంది సింగరేణి సంస్థకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి సమీపంలోని మేడిగడ్డ బ్యారేజీ ఎగువ భాగంలో ఈతకు వెళ్లి మృతిచెందిన కుటుంబాలకు శ్రీపాదట్రస్టు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ఎరవెల్లి విలాస్‌రావు సోమవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి శ్రీధర్ బాబు, ట్రస్టు చైర్మన్ శీనుబాబు ఆదేశాలతో అందజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పోల్‌టాక్స్ భారం సరికాదు..

భూపాలపల్లి అర్బన్: కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం పోల్ టాక్స్ భారం మోపడం సరి కాదని ఇండివిజువల్ కేబుల్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేషాల రమేష్‌బాబు అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కృష్ణ కాలనీ సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఇండివిజువల్ కేబుల్ ఆపరేటర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా రమేష్‌బాబు హాజరై మాట్లాడారు. ఇప్పటికే నష్టాల్లో నడుపుతున్న కేబుల్ టీవీలపై ప్రభుత్వం ఎస్పీడీసీఎల్ ద్వారా పోల్ టాక్స్ పేరుతో అదనంగా వాడుతున్న కరెంటు పోల్‌లను లెక్కించి పోల్‌టాక్స్ భారం పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. కేబుల్ టీవీ ఆపరేటర్లను కుటీర పరిశ్రమలుగా గుర్తించి వివిధ శాఖల ద్వారా రుణ సదుపాయం కల్పించి కేబుల్ టీవీలను ప్రోత్సహించాలని కోరారు. సమావేశం అనంతరం కేబుల్ ఆపరేటర్లు ఎమ్మెల్యే కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



వెంకటాపురం(కె): మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోదాపురం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నెలకొన్న సమస్యను తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాబోయే వర్షాకాలం సీజన్‌లో వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున, వాగుల వద్దకు ఎవరూ వెళ్లొద్దన్నారు. అనంతరం గ్రామస్తులకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: దివ్యాంగులకు ఉపకరణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారి తుల రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉపకరణాల మంజూరు చేపట్టారని, అర్హత కలిగిన వారు ఈ నెల 18వ తేదీ లోపు టీజీఓబీఎంఎంఎస్. సీజీజీ. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది జిల్లాకు రెట్రోఫిటెడ్ స్కూటీలు -14, బ్యాటరీ వీల్ చైర్‌లు- 4, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్స్- 6, హైబ్రిడ్ వీల్ చైర్స్ -1, లాప్‌ట్యాప్స్-5, జి స్మార్ట్ ఫోన్లు -1, ట్రై సైకిల్స్-3, వీల్ చైర్స్-2, చేతి కర్రలు-7, వినికిడి యంత్రాలు-1, స్మార్ట్ కేన్స్-4, ఎంసీఆర్ చెప్పల్స్ -4 కేటాయించినట్లు తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాయంపై స్పష్టత కరువు..

ఇప్పటికే జిల్లాలో వానాకాలం సాగు పనులు షురూ అయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కౌలు రైతు సాయంపై స్పష్టత లేదు. ప్రభుత్వం కౌలు రైతులకు సంబంధించిన వివరాలను సైతం సేకరించిన దాఖలాలు లేవు. దీంతో కౌలు రైతులను గుర్తించే యోచన కూడా చేయలేదని తెలుస్తుంది. ఈ ఏడాది సైతం కౌలు సాయం రైతులకు చేరే అవకాశాలు కనిపించడం లేదు.





ఏడాదిన్నరగా ఎదురుచూపు

కౌలు రైతుకు అందని పెట్టుబడి సాయం

- పెరిగిన కౌలు, విత్తన, ఎరువుల ధరలు
- నెరవేరని కాంగ్రెస్ ప్రభుత్వ హామీ
- ప్రైవేట్ అప్పులతో కౌలు రైతుపై ఆర్థిక భారం

పంట సాగు వివరాలు..

వరి	1,12,218 ఎకరాలు
పత్తి	93,823 ఎకరాలు

కాటారం: కౌలు రైతులకు సైతం ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం అందజేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. హామీ ఇచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటికీ కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంట సాగుతో వచ్చిన కొంత మొత్తంతో వడ్డీలు కట్టలేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ప్రతి సీజన్‌లో ప్రభుత్వం నుంచి సహాయం అందక పెట్టుబడి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.

సుమారు 40వేల మంది కౌలు రైతులు..

జిల్లాలో సుమారు 40వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నట్లు 2016లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలింది. అరెకరం, ఎకరం భూమి ఉన్న రైతులు ప్రతి ఏటా తమకున్న కొద్దిపాటి భూమితో పాటు ఇతరుల భూములు కౌలుకు తీసుకొని పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది పత్తి, మిర్చి తోటలకు ఎకరాకు కౌలుకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు చెల్లించేవారు. ప్రస్తుతం రూ.20వేల వరకు పెరిగింది. వరి పొలాలకు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు కౌలు ఉండగా రూ.15వేల వరకు భూ యజమానులు కౌలు రైతుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. పంట చేతికొచ్చినా, రాకపోయినా కౌలు మాత్రం చెల్లించాల్సి వస్తుంది. సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీంతో కౌలు, చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి కోసం నానా పాట్లు పడుతున్నారు.

మూడు సీజన్‌లు గడుస్తున్నప్పటికీ..

ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులతో పాటు కౌలు రైతులను ఆదుకుంటామని స్పష్టంగా పేర్కొంది. అర్హులైన ప్రతి కౌలు రైతుకు ఏడాదికి రూ.15వేలు సహాయంగా అందిస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. ఆ హామీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు సహాయం అందుతుందని రైతులు భావించినప్పటికీ నిరాశే మిగిలిపోయింది. మూడు సీజన్‌లు గడుస్తున్నప్పటికీ కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు.

కౌలు రైతులకు భరోసా కల్పించాలి..



ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకొని భరోసా కల్పించాలి. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని పంట సాగుచేస్తే అప్పులపాలు కావాల్సి వస్తుంది తప్ప రూపాయి మిగిలింది లేదు. ఓ పక్క పెరిగిన కౌలు, మరో పక్క విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులకు అధిక ధరలు ఉండటంతో పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులకు సాయం అందించే ప్రక్రియ ప్రారంభించాలి.

\- సంపత్, రైతు, టేకుమట్ల

ఆదేశాలు లేవు..



కౌలు రైతులకు సంబంధించిన పెట్టుబడి సాయం గురించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం రైతులు సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ ద్వారా పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నాం. రైతులు నకిలీ విత్తనాల భారినపడి మోసపోకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

\- వీరునాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

భూపాలపల్లి: ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. 22 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో ట్రైనీ ఐఏఎస్‌లు

- పర్యటనకు ఏర్పాట్లు చేయాలి
- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ టీఎస్ దివాకర

భూపాలపల్లి: 2024 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం ఈనెల 11, 12 తేదీల్లో జిల్లా సందర్శనకు వస్తుందని, పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. 2024 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఈ ఏడాది మే 5వ తేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు శిక్షణలో ఉన్నారని అన్నారు. జిల్లాలో పలు పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలను సందర్శిస్తారన్నారు. శిక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో పనిచేస్తున్న సౌరబ్‌శర్మ, సలోని ఛబ్రా (ఆదిలాబాద్), హర్ష చౌదరి (వికారాబాద్), కెరోలిన్ చింగ్తియనమావి (నిజామాబాద్), కొయ్యాడ ప్రణయ్ కుమార్ (నారాయణపేట) జిల్లాకు వస్తున్నారని తెలిపారు. వీరు జిల్లాలోని పాండవుల గుట్ట, సింగరేణి బొగ్గు గనులు, ఎన్టీపీసీ, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శిస్తారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలి



బడిబాట కార్యక్రమంలో డీఈఓ రాజేందర్

జిల్లా విద్యాధికారి రాజేందర్

కాళేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరాలని, నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన మహదేవపూర్ మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర వసతులు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులు చేరేలా చూడాలని చెప్పారు. బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజిరెడ్డి, సీఎంఓ రాజేష్, ఎంఈఓలు ప్రకాశ్‌బాబు, వెంకట్‌రాజం ఉన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులు వెంటనే చెల్లించాలని కార్మికులు సోమవారం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ మాట్లాడారు. జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వంట బిల్లులు ఇవ్వలేదన్నారు. వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. కోడిగుడ్లు, అల్పాహార బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వరలక్ష్మి, ఉమాదేవి, బెల్లంకొండ స్వప్న, సంబడి చంద్రక్క, వేముల రాజేశ్వరి, సమత, సరోజన, కళావతి, మమత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పత్తాలేని వర్షాలు

వారం రోజులుగా రైతుల ఎదురుచూపు



వర్షాలు లేక రేగొండ మండలంలో వాడిపోతున్న పత్తి మొలకలు

- రోహిణి కార్తెలో ముందస్తు వర్షాలకు మురిసిన రైతులు
- ఇప్పటివరకు 25శాతం పంటల సాగు పూర్తి
- వాడిపోతున్న పత్తి మొలకలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో రోహిణి కార్తెలో ముందస్తు వర్షాలు మురిపించినా వారం రోజులుగా జాడ లేకపోవడంతో అన్నదాతలు వరుణుడి కరుణ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ యేడు మే చివరి మాసంలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో అన్నదాతలు ఉత్సాహంగా పంటల సాగు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా వానాకాలం సీజన్‌లో పత్తి, మొక్కజొన్న కంది పంటలను వర్షాధారంగానే సాగు చేస్తారు.

2,47,293 ఎకరాలలో సాగు..

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,47,293 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మే 20వ తేదీ నుంచి 30వరకు భారీ వర్షాలు కురిసిన తర్వాత ముఖం చాటేయడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అక్కడక్కడా మొలకెత్తిన పత్తి మొలకలు వాడిపోతున్నాయి. జిల్లాలో జూన్ 1నుంచి 9వరకు సాధారణ వర్షపాతం 60 మి.మీ.లు కాగా, ఇప్పటి వరకు 23 మీ.మీల లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. దాదాపుగా అన్ని మండలాల్లో అధిక లోటు వర్షపాతం కనిపిస్తుంది. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటే వేసిన విత్తనాలు నేలపాలయ్యే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. వాతావరణ శాఖ అధికారుల లెక్కల ప్రకారం రెండు మూడురోజుల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

జూన్ ప్రారంభం నుంచి..

జూన్ ప్రారంభం నుంచి వర్షాల జాడే కనిపించడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు రావడం లేదు. జూన్ 1నుంచి 9వరకు జిల్లాలో కనిష్టంగా 23 మి.మీ.ల వర్షం కురిసింది. జూన్ ప్రారంభం నుంచి వర్షాలు కురిసి ఉంటే ఇప్పటివరకు 50శాతం పంటల సాగు పూర్తయ్యేదని రైతులు చెబుతున్నారు. మే చివరి మాసంలో కురిసిన వర్షాలకు సాగునీటి వసతి ఉన్న కొంతమంది రైతులు పత్తి విత్తనాలను వేశారు. నేలలో సరైన తేమ ఉంచడంతో ఇప్పటికే విత్తనాలు కూడా మొలకెత్తాయి. వారం రోజులుగా వర్షపు జాడ కనిపించకపోవడంతో మొలకలు వాడిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. కొంతమంది రైతులు స్పింకర్ల ద్వారా మొలకలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. నీటివసతి లేని రైతులు మాత్రం వరుణుడి కరుణపైనే భారంవేస్తూ వదిలేస్తున్నారు. ఎకరానికి రూ.10వేల వరకు ఖర్చుచేసి విత్తనాలను విత్తినట్లు చెబుతున్నారు. అధికారులు మాత్రం ముందస్తు వర్షాలకే తొందరపడవద్దంటూ సూచిస్తున్నారు. పత్తి, మొక్కజొన్న పంటల సాగుకు మరింత సమయం ఉందని పేర్కొంటున్నారు.

తప్పని ఎదురుచూపు

జిల్లాలో ఎక్కువగా వర్షాధార పంటలనే సాగు చేయడంతో వరుణుడి కరుణ కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులు వర్షాలకోసం గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా చిట్యాల, రేగొండ, టేకుమట్ల, భూపాలపల్లి మండలాల్లో కొంతమంది రైతులు పత్తి విత్తనాలు విత్తారు. జిల్లావ్యాప్తంగా 25శాతం పంటల సాగు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలా పంటల సాగును వర్షాలు కురిసిన తర్వాతనే చేపట్టే అవకాశం కనిపిస్తుంది. కొంత మంది రైతులైతే మే మాసంలోనే పొడినేలల్లోనే విత్తనాలు వేసి వదిలేశారు. వర్షాలు కురవగానే పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు చెబుతున్నారు.

ఆశపెట్టిన రోహిణి..

రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కొడతాయన్న నానుడి ఉండేది. కానీ ఈ యేడు రోహిణి కార్తెలోనే భారీ వర్షాలు కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. దీంతో ఆదరాబాదరగా అన్నదాతలు పంటల సాగును ప్రారంభించారు. జూన్ మాసం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో అన్నదాతల అంచనాలు తారుమారవుతున్నాయి. ముందస్తు వర్షాలతో మురిపించినా తొలకరి వర్షాలు కరుణించడం లేదంటున్నారు. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె మొదలైనా వరుణుడు కరుణించకపోవడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది. దీంతో పంటల సాగు పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందంటున్నారు. నేలలో 60నుంచి 70శాతం తేమ ఉంటేనే విత్తనాలను విత్తుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నల్లరేగడి నేలల్లో కొంత తేమ ఉన్నా చలక నేలలు మాత్రం బీటలు వారి కనిపిస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో విత్తనాలను విత్తుతే మొలకెత్తే పరిస్థితి ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

విమానాశ్రయానికి మరో అడుగు

- మామునూరు ఎయిర్‌పోర్ట్ భూనిర్వాసితులతో చర్చించిన అధికారులు
- ధరల నిర్ణయాలపై మెజార్టీ నిర్వాసితుల సానుకూలత
- వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.కోటి 20 లక్షలు..
- వ్యవసాయేతర భూములకు గజానికి రూ.4,000..



సాక్షి, వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్ట్ పునర్నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈనేపథ్యంలో సమీప గ్రామాల ప్రజల నుంచి సేకరించే భూమికి పరిహారం నిర్ణయించడం.. అందుకు భూనిర్వాసితులు సానుకూలత వ్యక్తం చేయడంతో విమానాశ్రయ నిర్మాణానికి మరో అడుగు పడ్డట్టైంది. కలెక్టర్ సత్యశారద నేతృత్వంలోని జిల్లా చర్చల కమిటీ నిర్వాసితులతో చర్చించింది. వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.కోటి 20 లక్షలు, వ్యవసాయేతర భూములకు చదరపు గజానికి రూ.4,887 ఇస్తామని, అంతకు మించి పెంచే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. దీంతో నక్కలపల్లి, గాడిపల్లి, గుంటూరుపల్లి భూనిర్వాసితులు భూములు ఇచ్చేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. వీరిలో గుంటూరుపల్లికి చెందిన కొందరు రైతులు తమ భూములు మెయిన్ రోడ్డుకు ఉన్నాయని, ఇంకాస్త ఎక్కువ ధర వస్తుందన్న ఆలోచనలో ఉన్నవారితో తహసీల్దార్, ఆర్ఐ తదితరులు చర్చించి ఎక్కువ ధర ఇచ్చే అవకాశం లేదని చెప్పారు. కలెక్టర్ తనకున్న విచక్షణాధికారాలతో జనరల్ అవార్డు కింద రూ.65 లక్షలు ఉంటే కన్సెంట్ అవార్డు కింద రూ.కోటి 20లక్షల వరకు తీసుకొచ్చారని వివరించారు. గత బుధ, గురువారాల్లో జరిగిన భూసేకరణ ధర పెంపు నిర్ణయంపై సమావేశంలో పాల్గొనని రైతులకు కూడా ఈ విషయమై స్పష్టతనిచ్చారు. అయితే తమ భూములు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్న చాలా మంది రైతులు అవసరమైన వివరాలు, పత్రాలు(పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, పాస్‌బుక్) సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు ఇప్పటికే డాక్యుమెంట్లు ఇచ్చారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. 253 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా కలెక్టర్ సత్యశారద నిర్ణయంతో మరో రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు అదనంగా అవసరం కానుండడంతో ఇప్పటికే ఆమె రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక సమర్పించినట్లు తెలిసింది.

భూసేకరణ కాగానే పనులు మొదలు..

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో వాణిజ్య విమానాశ్రయం ఉండొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో హైదరాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్‌కు ఒప్పందం ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థతో చర్చలు జరపడంతో గతేడాది నిరంభ్యంతర పత్రం వచ్చింది. 2024 నవంబర్‌లోనే 253 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు కేటాయిస్తూ జీఓను ఇచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర విమానయాన శాఖ సైతం భూసేకరణ ప్రక్రియ ఓ కొలిక్కి రాగానే పనులు ప్రారంభించేందుకు రూ.450 కోట్లు నిధులను కేటాయించింది. భూ సేకరణ ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇస్తే ఏఏఐ విమానాశ్రయ విస్తరణ పనులను ప్రారంభించనుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు పరిధిలో 696.14 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమిని 136 మంది రైతుల నుంచి సేకరించాల్సి ఉండగా, అది కూడా పూర్తి కావచ్చింది. భూ నోటిఫికేషన్ ప్రకారం రైతులు తమ భూపత్రాల వివరాలు ఇవ్వగానే, వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తూనే భూమి సేకరించనుంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు పలు దఫాలుగా సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే 150 నుంచి 186 మంది ప్రయాణించే వీలున్న 37.6 మీటర్లు పొడవున్న ఏ 320, బీ-737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్రస్థాయి ఆయుర్వేద వైద్య సదస్సు

- 11న ఉచిత మెగా వైద్యశిబిరం

జనగామ: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డున ఉన్న వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌లో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఆయుర్వేద వైద్య సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్‌నెస్ సెంటర్ ఫౌండర్ అంజిరెడ్డి సోమవారం తెలిపారు. 'కౌశలం 2025 ఆయుర్వేదం' పేరుతో విశ్వ ఆయుర్వేద పరిషత్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జనగామ వేద పంచకర్మ, వెల్‌నెస్ సహకారంతో నిర్వహించే ఈ సదస్సుకు ఢిల్లీ, ముంబాయి, కర్ణాటక, ఏపీ, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. పంచకర్మ విధానాలపై హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్, ఓపీ, ఐపీడీ సందర్శనలు, ఆయుర్వేద చికిత్స విధానాలపై చర్చా గోష్టి, ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా ఆయుర్వేద వైద్య విద్యార్థులు నైపుణ్య చికిత్స విధానం, భవిష్యత్ అవకాశాలు తెలుసుకోవచ్చన్నారు. ఇదిలా ఉండగా 11వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతిలేని విత్తనాలు విక్రయించొద్దు

- విజిలెన్స్ డీఎస్పీ మల్లయ్య
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో దాడులు



విత్తన షాపులో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ మల్లయ్య, ఏఓ రవీందర్

ఖిలా వరంగల్ : ప్రభుత్వ అనుమతులు లేని పురుగు మందులు, విత్తనాల విక్రయించినా, నిల్వచేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని విజిలెన్స్ డీఎస్పీ బి.మల్లయ్య, ఏఓ రవీందర్ హెచ్చరించారు. సోమవారం వరంగల్ స్టేషన్ రోడ్డు, ఫోర్ట్‌రోడ్డులోని సీడ్స్, పురుగు మందుల షాపులపై విజిలెన్స్, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పలు విత్తనాల షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫెర్టిలైజర్ షాపుల్లో రికార్డుల్లో నమోదు చేయని రూ.1,12,03,718ల విలువైన పురుగు మందులను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ, ఏఓలు మాట్లాడుతూ నిబంధనల మేరకు విత్తనాలు విక్రయించాలని, రికార్డుల ప్రకారం స్టాక్ మెంటేన్ చేయాలని సూచించారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసేటప్పుడు డీలర్‌ను కచ్చితంగా రశీదు తీసుకోవాలని సూచించారు. ఆలాగే బీటీ-3 విత్తనాలు ఎవరైనా అమ్మితే పోలీసు, వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. తనిఖీలో ఇన్‌స్పెక్టర్ రాకేష్, రెవెన్యూ అధికారి ఏవీ భాస్కర్, పీ.రవి తదితరులు పాల్గొన్నారు.



పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ షురూ!

- టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభం
- తొలి రోజు 80కి పైగా పీపీఏలు
- రెండు రోజుల పాటు కొనసాగింపు



రైతులతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ మార్చుకుంటున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్ కుమార్, తిరుపతి రెడ్డి, మధుసూదన్

హన్మకొండ: పీఎం కుసుం పథకంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ కార్యక్రమం షురూ అయ్యింది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో సోమవారం హనుమకొండలోని కంపెనీ కార్యాలయంలో ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు, సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుం) పథకం తీసుకొచ్చింది. ప్రధానంగా రైతులను సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సహిస్తుంది. రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందుగా నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి స్థలం 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు 5 కిలో మీటర్ల లోపు దూరం మాత్రమే ఉండాలి. 500 కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల ఉత్పత్తి వరకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వెయ్యి మెగావాట్లు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా 3 వేల మెగావాట్లు రైతులతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి ఉత్పత్తి చేయాలనేదే ఈ పథకం ఉద్దేశం. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో దరఖాస్తు చేసుకుని రూ.లక్ష చొప్పున ఈఎండీ చెల్లించిన 461 మందికి రెడ్ కో లెటర్ ఆఫ్ అక్సెప్టెన్సీ జారీ చేసింది. వీరితో ఇప్పుడు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. కాగా, మొదటి రోజు 80కి పైగా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్‌లు జరిగాయి. ఈ కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగనుంది. ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, ఐపీసీ అండ్ రాక్ చీఫ్ ఇంజనీర్ కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

'క్రూ' వర్కింగ్ సిస్టంపై చిన్నచూపు

- సైడింగ్ పాయింట్లకే కాజీపేట రైల్వే క్రూల పరిమితం
- ఆందోళనలో రన్నింగ్ స్టాఫ్ కార్మికులు



కాజీపేట రైల్వే క్రూ డిపో కార్యాలయం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డ్రైవర్ల కార్యాలయ కేంద్రంగా పని చేస్తున్న క్రూ (లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్)లను మెయిన్‌లైన్‌లో కాకుండా బొగ్గు, సిమెంట్ సైడింగ్ పాయింట్లకే పరిమితం చేసి పని చేయిస్తున్నారని రన్నింగ్‌స్టాఫ్ రైల్వే కార్మికులు ఆరోపిస్తున్నారు. కాజీపేట క్రూ డిపో ఏర్పాటు చరిత్రలో ఇప్పటి వరకు లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు మెయిన్‌లైన్‌లో కాజీపేట-బల్లార్షా వరకు అప్ అండ్ డౌన్‌లో విధులు నిర్వర్తించేవారని వారు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ రైల్వే యంత్రాంగం అనాలోచితంగా కాజీపేట క్రూ డిపోను చిన్నచూపు చూస్తూ క్రూ వర్కింగ్ సిస్టం నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి కొంత సిబ్బందిని (కాజీపేట క్రూలు) మంచిర్యాల, మందమర్రి, రామగుండం, బెల్లంపల్లిలో సైడింగ్‌లకు పరిమితం చేసి వర్కింగ్ చేయిస్తున్నారని, ఖాళీ వ్యాగన్లతో గూడ్స్‌ను తీసుకెళ్లి లోడింగ్ చేయించడం, అక్కడ ఉండి మళ్లీ లోడింగ్ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కోచింగ్ క్రూ లింక్‌లను కూడా విడదీస్తూ గూడ్స్ డ్రైవర్ల వర్కింగ్ మాదిరి ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్ విధానంలో కోచింగ్ క్రూలను బుక్ చేస్తున్నారని రన్నింగ్‌స్టాఫ్ పేర్కొంటున్నారు. హెడ్‌క్వార్టర్స్, ఔట్ స్టేషన్లలో ఈ విధానం పాటించడం వల్ల హెచ్‌ఓఈఆర్ (అవర్స్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ రూల్స్) నిబంధనలు ఉల్లంఘనకు గురై ప్రయాణికులకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉందంటున్నారు. దీనిపై ఇప్పటికైనా సికింద్రాబాద్ రైల్వే యంత్రాంగం స్పందించి కాజీపేట క్రూ డిపో, లోకోపైలెట్ల, అసిస్టెంట్ లోకోపైట్ల ప్రాధాన్యం తగ్గించొద్దని రైల్వే నాయకులు, రన్నింగ్‌స్టాఫ్ కార్మికులు సోమవారం కోరారు. కాగా, ఇటీవల వరుసగా ప్రజాప్రతినిధులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో ఏదో ఒక విషయంపై చర్చిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం క్రూల పనితీరుపై లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్లు ఆరోపణలు చేయడం గమనార్హం.

వివాహిత హత్యకేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ఎల్కతుర్తి : వివాహిత హత్యకేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌కు చెందిన మృతురాలు కోల సుమలత, నిందితుడు గూళ్ల రాజు ఇళ్లు పక్కపక్కన ఉంటాయి. ఈ క్రమంలో మూడు సంవత్సరాల క్రితం రాజుకు చెందిన లేగదూడ చనిపోయిన విషయంలో గొడవ జరిగింది. ఈ ఘటనలో సుమలత బావ సంపత్‌ను కొట్టిన విషయంలో రాజుపై ముల్కనూరు పీఎస్‌లో కేసు నమోదైంది. దీంతో రాజు రెండు రోజులు జైలుల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ కేసులో సుమలత ప్రత్యక్ష సాక్షిగా ఉండగా నిందితుడు తనను పలుమార్లు రాజీ పడాలని కోరగా సుమలత వినలేదు. ఈ కేసులో సాక్ష్యం చెప్పొద్దని, రాజీ పడాలని రాజు.. సుమలత ఇంటికెళ్లి చంపుతానని బెదిరిస్తున్న సమయంలో మృతురాలి కుమారుడు వెంకటేశ్ అడ్డొచ్చాడు. దీంతో అతడిపై గొడ్డలితో దాడికి పాల్పడిన ఘటనలో ఇదే పీఎస్‌లో రాజుపై హత్యాయత్నం కేసు నమోదు కాగా నిందితుడు 60 రోజుల పాటు జైలులో ఉండి మెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ క్రమంలోనే మొదటి కేసు ట్రయల్‌కు వచ్చింది. ఈ నెల 11న పేషీ ఉంది. ఈ కేసులో సుమలత సాక్ష్యం చెప్పితే శిక్ష పడుతుందని తెలిసి కొన్ని రోజుల నుంచి రాజు.. సుమలతను రాజీపడమని బెదిరించగా ఆమె వినలేదు. ఈ క్రమంలో ఈనెల 5న సుమలత ఇంటివద్ద ఉంది. దీంతో సుమలతను చంపితే కేసులో శిక్ష నుంచి తప్పించుకోవచ్చని భావించిన రాజు.. గొడ్డలితో ఆమెపై దాడికి పాల్పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ముల్కనూరు గ్రామ శివారులో కనిపించగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో సమర్థవంత విధులు నిర్వర్తించిన సీఐ పులి రమేశ్, ఎస్సైలు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్, దివ్యను ఏసీపీ అభినందించారు.

పట్టపగలే భారీ చోరీ..

- 18 తులాల బంగారం అపహరణ
- పడమరకోటలో ఘటన

ఖిలా వరంగల్: పడమరకోటలో ఓ కుటుంబ ఇంటికి తాళం వేసి ఊరెళ్లగా.. దుండగులు పట్టపగలే భారీ చోరీకి పాల్పడ్డారు. ఖిలా వరంగల్ పడమర కోటకు చెందిన ఆర్ఎంపీ రామకృష్ణ వ్యక్తిగత పని నిమిత్తం ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు మధ్యాహ్నం తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన 18 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. రాత్రి దంపతులు ఇంటికి రాగా.. ప్రధాన ద్వారానికి వేసిన తాళం ధ్వంసమై కనిపించడంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీకాంత్ సోమవారం ఉదయం క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరు పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఇంటి దొంగలే పనేనా.. మరి ఎవరైనా ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ నుంచి ఉపకరణాలు కావాల్సిన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ సైకిళ్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్స్, హైబ్రీడ్ వీల్ చైర్, అటాచ్మెంట్ వీల్ చైర్, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్, 4జీ ఫోన్లు, ట్రైసైకిళ్లు, కాలిపర్స్, ఆర్టిఫీషియల్ లిమ్బ్స్, క్రచెస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేన్స్, బ్రెయిలీ బుక్స్ కిట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్, ఎంసీఆర్ చప్పల్స్‌ను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 18 లోపు ఆన్‌లైన్‌లో obmms. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు హనుమకొండ ఐడీఓసీలోని స్త్రీ, శిశు సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

భూమి కబ్జా చేశారని మనస్తాపం..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఉర్సుగుట్టలో ఘటన
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు సూసైడ్‌నోట్



బాధితుడి కుమారుడితో మాట్లాడుతున్న ఎస్సై

ఖిలా వరంగల్: తమ జీవనాధారమైన 14 గుంటల భూమిని కబ్జా చేశారనే మనస్తాపంతో ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సుగుట్ట తాళ్లపద్మావతి కాలేజీ సమీపంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన పోలపాక కుమారస్వామి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారసత్వంగా సంక్రమించిన భూమిని విక్రయించగా.. మిగతా 14గంటల భూమి ఉర్సు గుట్ట తాళ్లపద్మావతి కళాశాల సమీపంలో ఉంది. ఇటీవల తాళ్ల మల్లేశం, బండి కుమారస్వామి, పులి రజింత్‌రెడ్డి అనే వ్యక్తులు 14 గుంటల భూమి కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. ఆ భూమి తమదేనని పత్రాలతో వెళ్తే ఎస్సీ, ఎస్టీ పేరుతో దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన కుమారస్వామి సోమవారం సాయంత్రం తన భూమి వద్దకు వెళ్లాడు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు సూసైడ్ నోట్ రాసి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలికి చేరుకున్నారు. బాధితుడి బంధువులతో మాట్లాడి వివరాలు సేకరించారు. బాధితుడికి 80 శాతంపైగా గాయాలు కావడంతో బంధువులు హుటాహుటిన 108లో ఎంజీఎం తరలించారు.

ముగ్గురిపై కేసు నమోదు..

తన 14 గంటలు భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ పొలెపాక కుమారస్వామి ఆత్మహత్యకు యత్నించి ఎంజీఎంలో చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. దీనిపై కుమారస్వామి కుమారుడు రాంకుమార్ ఫిర్యాదు మేరకు పులి రజింత్‌రెడ్డి, బండి కుమారస్వామి, తాళ్ల మల్లేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

భార్య వేధింపులు.. ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నం



మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్

శాయంపేట : భార్య వేధింపులు తట్టుకోలేక ఓ ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. కుటుంబీకుల కథనం వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ప్రవీణ్ సికింద్రాబాద్ తిరుమలగిరిలోని టెరిటోరియల్ ఆర్మీ 125 బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన రజనికతో 2020లో వివాహమైంది. కొంత కాలంగా దంపతుల మధ్య తరుచూ గొడువలు జరుగుతున్నాయి. భార్యతోపాటు అత్తింటి వారు కూడా ప్రవీణ్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రవీణ్ ఉద్యోగానికి వెళ్లకుండా ఐడీ కార్డు దాచిపెట్టి వేధించారు. ఈక్రమంలో ప్రవీణ్ రెండు నెలల క్రితం విధులకు వెళ్లగా తన భార్య బెటాలియన్ వద్దకు వెళ్లింది. అక్కడ గొడవ చేసి ప్రవీణ్ పరువు తీయడంతో మనస్తాపం చెందాడు. దీంతో సెలవుల నిమిత్తం ప్రవీణ్.. ఈ నెల 6న ఇంటికొచ్చి కుటుంబీకులతో మాట్లాడి హనుమకొండకు వెళ్లాడు. 8న హనుమకొండలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి తన అన్న ప్రసాద్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వెంటనే ప్రవీణ్‌ను తిరుమలగిరిలోని మిలటరీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆత్మహత్యాయత్నానికి ముందు ప్రవీణ్ సూసైడ్ నోట్ రాశాడు. అందులో 'డియర్ ఫ్రెండ్స్ నేను చనిపోతున్నా.. నా చావుకి కారణమెవరో వాళ్లకు తెలుసు. వాళ్ల టార్చర్ తట్టుకోలేకపోతున్నా. అన్నా అమ్మను జాగ్రత్తగా చూసుకో. మన గ్రామంలో వాలీబాల్ టీమ్ బతకాలి, ఎప్పుడూ గేమ్‌ను వదలొద్దు' అని పేర్కొన్నారు.

టీపీసీసీలో ఉమ్మడి జిల్లా నేతలకు కీలక పదవులు



నాయిని రాజేందర్‌రెడ్డి | అనుమాండ్ల ఝాన్సీ | బస్వరాజు సారయ్య | నమిండ్ల శ్రీనివాస్ | ఈ.వీ. శ్రీనివాస్‌రావు | లకావత్ ధన్వంతి

- ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా పలువురికి అవకాశం

సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐసీసీ తాజాగా 27 మంది నేతలకు పార్టీ ఉపాధ్యక్ష పదవి, 69 మందికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవులకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ.వేణుగోపాల్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నమిండ్ల శ్రీనివాస్, లకావత్ ధన్వంతి, టి.కుమార్‌రావులను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు. అదేవిధంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, కత్తి వెంకటస్వామి, మల్లాడి రాంరెడ్డిలకు అవకాశం దక్కింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

- మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ, B.Sc (Agree), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సం.ప్ర. 99481 31154 [SCA 25004771]

REAL ESTATE

TO-LET

- 3 BHK ఫ్యామిలీ పోర్షన్ FCI కాలనీ, రోడ్ No.2, H.No.35-3-75, గోపాలపురం, హన్మకొండ. సెల్: 9866549297, 8712309298. [SCA25004457]

SERVICES

LOSS OF CERTIFICATE

- Perumalachetty Jayasree D/o Chandramouli Kondi H.No: 24-7-59, Fathima nagar, Kazipet (Mdl), Hanamakonda (Dist). TS. Have lost my original Degree certificate and Marks sheet bearing Roll on: 95606 while Travelling Kazipet Railway station to Fathimanagar in Auto. Inspite of my best efforts unable to trace. If anyone is found. Please inform me at the above address and contact No: 97017 94300 [MW 13565]

BUSINESS SERVICES

- ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, నలహాలకి కాల్ చేయండి: 7406393937 [IA-465]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

- మీ బంగారం మునప్పురం ముత్తూట్, మర్వాడి షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మాదబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783417]

WANTED

- హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పని చేయుటకు కార్ ఎలక్ట్రీషన్స్, నూ॥ఫైజర్స్ (F) & కార్ వాషింగ్ చేయుటకు (M/F) వర్కర్స్ కావలెను. 7995621165, 6303776310 [WA-30]
- ఇంటిలో మరియు మా పెంపుడు కుక్కలను చూసుకోటానికి పనివారు కాజీపేటలో కావలెను. జీతము + భోజనము + వసతి కలదు. ఆసక్తి గలవారు కాల్ చేయండి. 9963478557 [WB-9546]

ఈ పెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కేయూలో ఉద్యోగుల ఎన్నికల సందడి

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



కేయూలో ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేస్తున్న సభ్యులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగుల ఎన్నికల సందడి నెలకొంది. కేయూలో ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియకు ఇటీవలనే అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి నామినేషన్లను స్వీకరించారు. వివిధ పదవులకు నామినేషన్లను స్వీకరించారు. సోమవారం సాయంత్రం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. వివిధ పదవులకు నామినేషన్‌లు పోటీపోటీగా వేశారు. కేయూ ఎన్‌జీఓ అధ్యక్ష పదవికి నవీన్‌కుమార్, నిరంజన్, పోతు రాజు, జనరల్ సెక్రటరీగా తిరుపతి, నిరంజన్, అక్రమ్ మహ్మద్ నామినేషన్లు వేశారు. కోశాధికారి పదవికి దామోదర్, రాజు, ఎహెచ్ ప్రవీణ్‌కుమార్‌లు పోటీపడుతున్నారు. మిగతా పదవులకు నలుగురి చొప్పున అభ్యర్థులు పోటీపడుతున్నారు. మహిళా కార్యదర్శి కోసం ముగ్గురు ఉద్యోగులు పోటీపడుతున్నారు. క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలల్లో అధ్యక్ష పదవికి గుమ్మయ్య, కోర్నెల్, నిజాముద్దీన్‌లు, జనరల్ సెక్రటరీ కోసం బొక్క మొగిలి ,అంకూస్‌లు నామినేషన్లు వేశారు. ఈనెల 13వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంది. ఓటింగ్ ఈనెల 20న నిర్వహించనున్నారు. 21న ఫలితాలను వెల్లడిస్తారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా టీచింగ్ నాన్ టీచింగ్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్ వ్యవహరిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిశాక జాబితాను రాత్రి 8 గంటలకు వెల్లడించారు.

ఆకేరువాగులో పడి వివాహిత మృతి



పద్మ(ఫైల్)

చిన్నగూడూరు: ఆకేరువాగులో పడి ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన రచ్చ పద్మ(48) భర్తతో కలిసి ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. తన తల్లి గ్రామమైన చిన్నగూడూరుకు రెండు రోజుల క్రితం భర్తతో కలిసి వచ్చింది. సోమవారం ఉదయం పద్మ ఆకేరువాగులో పడి మృతి చెందింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక ఎస్సై సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పద్మ మానసిక స్థితి కొద్ది రోజులుగా బాగోలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు, భర్త ఉన్నారు.

తల్లి వైద్యానికి వెళ్లి.. కొడుకు మృతి!

- మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆరోపణ
- మృతదేహంతో కలెక్టరేట్ వద్ద ఆందోళన



నాగరాజు(ఫైల్)



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబీకులు

కాళేశ్వరం: తల్లికి ఆరోగ్యం బాగాలేదని కొడుకు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆస్పత్రిలో పరీక్షలు చేసుకున్న తల్లి తన కొడుకు అన్నం సరిగ్గా తింటలేడు, కడుపు నొప్పి అంటున్నాడని వైద్యులకు చూపించింది. పరీక్షలు చేసిన వైద్యులు (సెలెన్) గ్లూకోజ్ పెట్టి ఇంజక్షన్ ఇవ్వడంతో అస్వస్థతకు గురై యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామానికి చెందిన రాళ్లబండి సరోజన తనకు ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో కుమారుడు నాగరాజు(23) బైక్‌పై మహదేవపూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చాడు. వైద్యులు పరీక్షలు చేసి మందులు రాసిచ్చారు. కాగా, తల్లి తన కొడుకు కూడా ఆరోగ్యం బాగుండడం లేదని వైద్యులకు తెలిపింది. వైద్యులు నాగరాజుకు పరీక్షలు చేసి (సెలెన్) గ్లూకోజ్ ఎక్కించి, అందులో ఇంజక్షన్ వేశారు. ఈ క్రమంలో ఫిట్స్ వచ్చి అస్వస్థతకు గురయ్యాడని, వెంటనే భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తల్లికి సూచించి వెంటనే పంపారు. భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో కొడుకు మరణవార్తతో కోపోద్రేకులైన తల్లిదండ్రులు మృతదేహంతో కలెక్టరేట్ గేట్ వద్ద వైద్యం వికటించి మృతి చెందాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మహదేవపూర్ ఎస్సై వారికి నచ్చచెప్పి ధర్నా విరమింపజేశారు. ఈ ఘటనపై తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. సరోజన సత్తయ్య దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు మృతితో శోకసంద్రంలో మునిగారు. కాగా, వైద్యుల తప్పిదంతోనే నాగరాజు చనిపోయాడని, వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరిపి సంబంధిత వైద్యులను సస్పెండ్ చేసి, బాధితులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

లే నాన్నా.. అమ్మ, తమ్ముడు వచ్చాం

- తండ్రి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించిన కూతురు
- ట్రాక్టర్‌తో సహా బావిలో పడి వ్యక్తి మృతి
- రేపాకలో ఘటన



తిరుపతి రాజ్ (ఫైల్)

రేగొండ: నాన్న లే ఒకసారి.. అమ్మ, తమ్ముడు వచ్చాం అంటూ.. తండ్రి మృతదేహన్ని చూసి కూతురు విలవిల్లాడింది. రేపాకలో ట్రాక్టర్‌తో సహబావిలో పడి చనిపోయిన యువరైతు బోయిని తిరుపతి రాజ్ (30) మృతదేహం వద్ద అతడి కుమార్తె విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక గ్రామానికి చెందిన బోయిని తిరుపతి రాజ్ తన వ్యవసాయ భూమిలో రోటవేటర్‌తో దున్నేందుకు ఉదయం ట్రాక్టర్‌పై వెళ్లాడు. దున్నే క్రమంలో ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు సమీపంలోని వ్యవసాయ బావిలో పడ్డాడు. బావిలో నీరు లేకపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. తిరుపతి రాజ్ మృతదేహం మీద పడి భార్య, కూతురు, కుమారుడు గుండెలవిసేలా రోదించారు. నాన్న లే .. నాన్న లే అంటూ దిక్కులు పిక్కటిలేలా కూతురు, కుమారుడు విలపించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బోయిని రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, కూతురు, కొడుకు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి


- కాపాడే ప్రయత్నంలో మరో ఇద్దరికి షాక్
- తండాధర్మారం గ్రామంలో సంఘటన



పత్యానాయక్ (ఫైల్)

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. అతడిని కాపాడే యత్నంలో మరో ఇద్దరు షాక్‌కు గురయ్యారు. ఈ ఘటన సోమవారం మరిపెడ మండలం తండాధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరంసోత్ పత్యానాయక్ (70) ఎదురింటి కప్పుపై పట్టాలు కల్పి దానికి ఇనుప తీగ బిగించారు. కరెంట్ తీగ ఆ ఇంటిపై బిగించిన ఇనుప తీగకు ఆనుకుని విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ క్రమంలో పత్యానాయక్ ఆ ఇంటి ఎదుట పని చేస్తుండగా ఇనుప తీగ తగలడంతో షాక్ తగిలి కిందపడ్డాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో మనవడు సతీశ్, కోడలు బుజ్జి షాక్ గురయ్యారు. ఇది గమనించిన మరో మనవడు రాజేశ్ కర్ర సాయంతో వారిని రక్షించాడు. ప్రాణాపాయస్థితి నుంచి కోడలు, మనవడు బయటపడగా పత్యానాయక్ మాత్రం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



మడికొండ-ధర్మసాగర్ రోడ్డుపై బోల్తా పడిన కారు

మడికొండ: ప్రమాదవశాత్తు కారు బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మడికొండ-ధర్మసాగర్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం దామెరకు చెందిన అశోక్ ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తు కారులో పని నిమిత్తం హనుమకొండకు వెళ్లి తిరిగి మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తున్నాడు. ధర్మసాగర్ పెట్రోల్ పంపు సమీపంలో టైరు బ్లాస్ట్ కావడంతో కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో అశోక్‌తో పాటు అతని కుటుంబ సభ్యులకు సైతం గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని వివరాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.